# అంతా రామమయం

- మార్మోగిన అయోధ్య రాముడి నామస్మరణ
- ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు
- స్వామిని దర్శించి తరించిన భక్తజనం



మురళీనగర్ రామాలయంలో స్వామిని దర్శించుకుంటున్న కె.కె.రాజు, వావిలపల్లి ప్రసాద్ తదితరులు

**సీతంపేట:** అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా సోమవారం వాడవాడలా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాల్లో శ్రీరాముడి కల్యాణం, పట్టాభిషేకం, అన్నప్రసాద వితరణ, పానకం, వడపప్పు పంపిణీ, జైశ్రీరామ్ అంటూ ర్యాలీలతో నియోజకవర్గమంతా రామమయమైంది.

**లలితా పీఠంలో వైభవంగా పట్టాభిషేకం**

అక్కయ్యపాలెం లలితానగర్‌లోని శ్రీలలితా పీఠంలో సీతారాముల పట్టాభిషేకం వైభవంగా నిర్వహించారు. పండితులు శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం జరిపారు. భక్తులకు పానకం, వడపప్పు, అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు పంచిపెట్టారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

**సిద్ధేశ్వరానంద స్వామికి గురువందనం**

లలితా పీఠాధిపతి జగద్గురు శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి 88వ అవతరణ దినోత్సవాన్ని పీఠం దర్బారు హాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహాస్వామి చిత్రపటానికి పూజలు చేసి, గురువందనం సమర్పించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణ సేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- భక్తితో సేవ షిర్డీసాయి భజన సంఘం ఆధ్వర్యంలో సీతంపేట మూడుగుళ్ల వద్ద గల కల్యాణ మండపంలో సీతారాముల కల్యాణం, అనంతరం పట్టాభిషేకం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సీతారాముల విశిష్టత, జగదభిరాముని కల్యాణంలోని విశేషాలను పండితులు భక్తులకు వివరించారు. అనంతరం పానకం, వడపప్పు, తలంబ్రాలు పంచిపెట్టారు. అన్నప్రసాద వితరణ చేశారు. 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, శ్రీకృష్ణ యువజన సేవా సంఘం ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



లలితా పీఠంలో జరుగుతున్న సీతారాముల పట్టాభిషేకం, గురువందన కార్యక్రమం

**శోభాయాత్ర, సుందరకాండ పారాయణం, భజనలు**

**సీతమ్మధార:** సీతమ్మధారలో నవోదయ స్కూల్ విద్యార్థులు భక్తిశ్రద్ధలతో ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు పాల్గొన్నారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని రమా హాస్పిటల్ నుంచి గురువాయూర్ శ్రీకృష్ణ మందిరం వరకు జై శ్రీరామ్ అంటూ జెండాలతో శోభాయాత్ర చేశారు. భక్తులకు అక్షింతలు పంపిణీ చేశారు.

- నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని ఒక అపార్ట్‌మెంట్‌లో శ్యామలదీపిక ఆధ్వర్యంలో సుందరకాండ పారాయణం, భజనలు, కీర్తనలు, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. స్థానిక ఆలయాల్లో అక్షింతలు పంపిణీ చేశారు. ర్యాలీలో బీజేపీ నార్త్ కన్వీనర్ సురేష్‌బాబు,వార్డు ప్రెసిడెంట్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

**రామయ్యను దర్శించిన కె.కె.రాజు**

**మద్రిపాలెం:** అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఎటు చూసినా రామనామ సంకీర్తనలే వినిపించాయి. జీవీఎంసీ 50వ వార్డు మురళీనగర్ రామాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, కో ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, పి.సునీత, పార్టీ మండల అధ్యక్షుడు పైడి కృష్ణారావు మాస్టర్, ఎం.లక్ష్మి, ఎం.వి.రెడ్డి, ఎ.వి.ఎస్.రాజు, టి.ఎస్.రెడ్డి, వరప్రసాద్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



మాధవస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు, భక్తులు

- జీవీఎంసీ 51వ వార్డు మాధవధారలోని మాధవ స్వామి ఆలయంలో కొలువైన వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణమంతా రామనామ సంకీర్తనతో మార్మోగింది. ఆలయ అర్చకులు నేదునూరి శ్రీనివాసశర్మ, సనపల రవీంద్రకుమార్, రాధాకృష్ణ అనంతరామ్ ఆధ్వర్యంలో స్వామి వారి సంకీర్తన, రామనామాలతో పారాయణ చేశారు. సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు భక్తులు స్వామివారిని కొలిచారు. అనంతరం వారికి తీర్థప్రసాదాలు అందించారు.
- 51వ వార్డు గాంధీనగర్-2 హరహర క్షేత్రంలోని భద్రాద్రి రామాలయంలో యువ సేన సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని రామనామ సంకీర్తన చేశారు.
- 53వ వార్డు సాయినగర్‌లోని శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రీరాముడికి విశేష పూజలు చేశారు. అన్నసంతర్పణ నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

**వైభవంగా శోభాయాత్ర**

**మురళీనగర్:** ఎన్‌జీజీవోస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైభవ వెంకటేశ్వర స్వామి సన్నిధి నుంచి శోభాయాత్ర నిర్వహించారు. ఆలయంలో అర్చకుడు శేషాచార్యుల ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అత్యధికసంఖ్యలో పాల్గొన్నారు. శోభాయాత్రలో భాగంగా రామనామ జపం, సంకీర్తనలు చేశారు. సాయంత్రం ఇళ్ల వద్ద దీపారాధనలు, రంగవల్లులు ఏర్పాటు చేశారు. స్థానిక వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు వి.పార్వతీశ్వరరావు, పి.బలరామస్వామి, కేఆర్‌సీహెచ్ రాజు, డి.కృష్ణమోహన్, శ్రీనివాస్, బి.బంగారురాజు పాల్గొన్నారు.

- మురళీనగర్ పరిసర ప్రాంతాలు రామనామ జపంతో మార్మోగాయి. బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఇళ్లల్లో ప్రజలు టీవీల్లో వీక్షించారు. రామాలయంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఆధ్వర్యంలో రామనామ సంకీర్తన చేశారు. ఎల్ఈడీ స్క్రీన్‌లో ప్రత్యక్ష ప్రసారాన్ని ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు రామాలయాన్ని సందర్శించి పూజలు చేశారు. ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టీఎస్ రెడ్డి, సనపల వరప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



ఎన్‌జీజీవోస్ కాలనీలో శోభాయాత్ర చేస్తున్న మహిళలు



వైభవుడి పూజల్లో పాల్గొన్న భక్తులు



లలితా పీఠంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు





సీతంపేటలో నిర్వహిస్తున్న సీతారాముల కల్యాణం.. వీక్షిస్తున్న భక్తులు



జెండాలతో ర్యాలీగా వెళ్తున్న విష్ణుకుమార్‌రాజు



సాయినగర్‌లో పూజలందుకున్న శ్రీరాముడు

## క్లుప్తంగా

### 'గ్రీవెన్స్'తో వినతుల పరిష్కారం



వినతులు పరిశీలిస్తున్న కె.కె.రాజు

**సీతమ్మధార:** బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. వాటిని కె.కె.రాజు పరిశీలించి కొన్ని సమస్యలను వెంటనే పరిష్కరించారు. మిగిలిన వినతులను సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

### 'స్పందన'కు 10 అర్జీలు

**సీతమ్మధార:** సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 10 వినతులు అందాయి. అర్జీదారుల వద్ద నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎం.ఆనందకుమార్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్, వీఆర్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

### ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ సతీష్

**కంచరపాలెం:** ఈ నెల 27న భీమిలి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో జరగనున్న బహిరంగ సభను వార్డు ప్రజలు విజయవంతం చేయాలని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ కోరారు. 46వ వార్డు శాంతినగర్ సచివాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం బహిరంగ సభలో వార్డు నుంచి ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పార్టీ శ్రేణులకు, సచివాలయ కన్వీనర్లకు, గృహసారథులకు పిలుపునిచ్చారు. కో ఆప్షన్ సభ్యుడు అప్పారావు, బి.గోవింద్, కె.చిన్నా, ఎస్.కృష్ణ, డి.నర్సింగ్‌రావు, ఎం.వి.రమణ, ఈశ్వరరావు, కె.శ్రీను, దుర్గాభవాని, నారాయణరెడ్డి, అప్పలరెడ్డి, అన్నపూర్ణ, దేవి, కోదండం, రాంబాబు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

### విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

**సీతమ్మధార:** ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధిలోని 11 కేవీ ఏపీఎస్ఈబీ 11 కేవీ, ఏఎస్సార్ నగర్ ఫీడర్‌లో మరమ్మతులు, చెట్టు కొమ్మల ట్రిమ్మింగ్ నిమిత్తం మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని జోన్-1, ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు సీతమ్మధార అభయ ఆంజనేయ స్వామి ఆలయం, ఎస్ఎఫ్ఎస్ స్కూల్ డౌన్, ఆర్ అండ్ బీ క్వార్టర్స్, అల్లూరి సీతారామరాజు జంక్షన్, క్షత్రియ కల్యాణ మండపం, ఏఎస్సార్ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

### అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం

**సీతమ్మధార:** జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం శివాలయం పక్క రోడ్డులోని సాయి విల్లా అపార్ట్‌మెంట్‌లో ఆదివారం తెల్లవారుజామున షార్ట్‌సర్క్యూట్ కావడంతో అగ్నిప్రమాదం సంభవించింది. సెకండ్ ఫ్లోర్‌లోని ఓ ఫ్లాట్‌లో వస్తువులు దగ్ధమయ్యాయి. వెంటనే పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. ఆస్తి నష్టం రూ.20 లక్షల వరకు ఉంటుందని బాధితులు తెలిపారు. సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ ఆనంద్‌కుమార్, కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

## తరింపచేసేదే రామ మార్గం

**తాటిచెట్లపాలెం:** రమింపచేసేది, తరింపచేసేది రామ మంత్రమని, రామాయణమంటే రాముని మార్గమని, సద్గుణాలకు, పరిపూర్ణత్వానికి రాముని జీవితం సంకేతమని ది వరల్డ్ టీచర్ ట్రస్ట్(జగద్గురు పీఠం) కార్యనిర్వాహక సభ్యుడు చింతలపాటి సత్యదేవ్ అన్నారు. అయోధ్యలో బాలరామ విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా సోమవారం తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఇ.కె.సంస్కృతి సదన్‌లో సంగీత జనకులం నిర్వహించిన శ్రీరామ భక్తి నివేదన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. సంగీత జనకులం అధ్యక్షుడు ఇంద్రగంటి కాశీప్రసాద్ మాట్లాడుతూ 1979లో కులపతి ఐవీఎల్ శాస్త్రి ఈ సంస్థను ప్రారంభించారని, ప్రతి మంగళ, గురు, శుక్రవారాల్లో మాస్టర్ ఇ.కె. సదన్‌లో సంగీతంలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. సంగీత జనకులం ఉపాధ్యాయిని ఐ.రమణి ప్రసాద్ వద్ద సంగీతం నేర్చుకుంటున్న విద్యార్థులు రాముని సంబంధిత 11 కీర్తనలను ఆయా రాగాల్లో వీనుల విందుగా ఆలపించారు. కార్యక్రమంలో శాస్త్రీయ సంగీత కళాకారిణి జి.శారదా సుబ్రహ్మణ్యం, సంగీత జనకులం విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చింతలపాటి సత్యదేవ్

## మద్యం మత్తులో నిప్పంటించుకున్న వ్యక్తికి గాయాలు

**మద్రిపాలెం:** కంచరపాలెం పరిధిలో ఓ వ్యక్తి మద్యం మత్తులో తలపై నిప్పంటించుకున్న ఘటన జరిగింది. ఐదో పట్టణ పోలీసుల వివరాలిలా... పైలా రాజు అనే వ్యక్తి కంచరపాలెం తిక్కవానిపాలెంలో భార్య, ఇద్దరి పిల్లలతో కలిసి నివసిస్తున్నాడు. ఇతడు పెయింటింగ్ పనులు చేస్తుంటాడు. ఆదివారం సాయంత్రం 7 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి పూటుగా మద్యం తాగాడు. తిరిగి వస్తుండగా ఇంటికి సమీపంలో టిన్నర్ ఆయిల్ తలపై వేసుకుని కాలుతుందో లేదో అని అగ్గిపెట్టితో నిప్పంటించుకున్నాడు. అతడు కాలిపోతుండగా అక్కడ సమీపంలో ఉన్న వాళ్లు చూసి ఇంట్లో అతడి భార్యకు తెలిపారు. ఆమె చుట్టుపక్కల వారి సహాయంతో కేజీహెచ్‌కు తరలించారు. భార్య పైలా ధన ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో ఏఎస్ఐ ఆదిరాజు కేసు దర్యాప్తు చేపట్టారు.

## ఓటరు జాబితాలో పేరు సరిచూసుకోండి

- డిప్యూటీ కలెక్టర్ అఖల



సూపర్‌వైజర్లకు సూచనలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ అఖిల

**సీతమ్మధార:** సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ కలెక్టర్ డి.అఖిల ఆధ్వర్యంలో సోమవారం పోలింగ్ బూత్‌ల సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉత్తర నియోజకవర్గంలోని 273 పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్ జాబితాలు అంటించి ఉన్నాయని తెలిపారు. వాటిని పరిశీలించి, పేర్లు, వివరాలను సరిచూసుకోవాలని ప్రజలకు సూచించారు. జాబితాలో పేరు నమోదు కాకపోతే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌కుమార్, జీవీఎంసీ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యా వ్యవస్థలో డిజిటల్ విప్లవం



మాధవధార హైస్కూల్‌లో ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులతో సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ ప్రసాద్

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

**మురళీనగర్:** ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర విద్యా వ్యవస్థలో డిజిటల్ విప్లవాన్ని సృష్టించి చరిత్రలో నిలిచారని వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు అన్నారు. మాధవధార జీవీఎంసీ హైస్కూల్‌లో సోమవారం 8వ తరగతి విద్యార్థులకు 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్‌తో కలిసి ఆయన ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి సాంకేతిక విజ్ఞానాన్ని అందించి ఉత్తమ విద్యా ప్రమాణాల సాధనకు కృషి చేస్తున్నారన్నారు. విద్యా వ్యవస్థను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కృష్ణారావు మాస్టారు, ఏవీఎస్ రాజు, హెచ్ఎం హేమలత, శ్రీనివాసరాజు, ఎంవీ రెడ్డి, రామ్మోహన్, సీహెచ్ శ్రీను, రాంబాబు, రామారావు, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎస్‌ఎంసీహెచ్ స్కూల్‌లో 8వ తరగతి విద్యార్థినికి ట్యాబ్ అందజేస్తున్న హెచ్ఎం రాంప్రసాద్

**ట్యాబ్‌లు సద్వినియోగం చేసుకోండి**

**సీతమ్మధార:** జీవీఎంసీ 24వ వార్డు పీ అండ్ టీ కాలనీలోని ఎస్ఎంసీహెచ్ స్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులకు హెచ్ఎం రాంప్రసాద్ చేతుల మీదుగా బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రపంచ శ్రేణి విద్య అందించే ప్రయత్నంలో రాష్ట్రంలోని విద్యార్థులకు సుమారు రూ.30 వేల విలువైన ట్యాబ్‌ను ఉచితంగా అందిస్తోందన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కోలాహలంగా అక్కయ్యపాలెం పరస

- విద్యుత్ కాంతుల్లో మూడుగుళ్ల ప్రాంతం
- జనంతో కిక్కిరిసిపోయిన వీధులు



పరస మహోత్సవంలో మాట్లాడుతున్న కె.కె.రాజు



పరసలో దుకాణాల వద్ద జనం సందడి



సేవా గరిడీ ప్రదర్శిస్తున్న కళాకారిణి

**సీతంపేట:** అక్కయ్యపాలెం పరస కోలాహలంగా సాగింది. స్థానిక జగన్నాథపురంలో కొలువైన కుంచుమాంబ, ముత్యమాంబ, భూలోకమాత, వేంకటేశ్వరస్వామి, సీతారాముల పరస మహోత్సవం సోమవారం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాలు, పరిసరాలను విద్యుత్ దీపాలు, పూల దండలతో చూడముచ్చటగా అలంకరించారు. ప్రజలు పెద్ద ఎత్తున పరసకు తరలి రావడంతో వీధులన్నీ కిక్కిరిసిపోయాయి. ఈ సందర్భంగా గౌరీ సేవా సంఘం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డ్యాన్స్ బేబీ డ్యాన్స్, సేవగరిడీలు, భజన చెట్టు, కోలాటం, చెక్కభజన, విద్యుత్ దీపాలంకరణతో మూడుగుళ్ల ప్రాంతం కళకళలాడింది.

**అమ్మవార్లు, వెంకన్నకు ప్రత్యేక పూజలు,**

పరసలో భాగంగా ఉదయం అమ్మవార్లు, వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, జలాభిషేకం, కుంకుమ పూజలు చేశారు.

భక్తులు మొక్కులు చెల్లించారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ, కేంద్ర గౌరీ గవర సేవా సంఘం అధ్యక్షుడు బుద్ధ శివాజీ ముఖ్య అతిథులుగా అమ్మవార్లకు పూజలు చేసి, భజన చెట్టు వద్ద దీపాలు వెలిగించి పరసను ప్రారంభించారు. గృహాలంకరణ, మహిళల అలంకరణ సామగ్రి, పిల్లల ఆట వస్తువులు, తినుబండారాల విక్రయాల దుకాణాల వద్ద జనం కొనుగోళ్లతో సందడి నెలకొంది. పరసలో పిల్లలు కేరింతలు కొట్టారు. గౌరీ సేవా సంఘం గౌరవాధ్యక్షులు పాలమరశెట్టి ఎస్.జె.వి.ప్రసాద్(పోర్టు), అధ్యక్షుడు కొయిలాడ వేణుగోపాల్, కమిటీ చైర్మన్ రాజగిరి అప్పలరాజు, వైస్ చైర్మన్ మళ్ల త్రినాథరావు, డిప్యూటీ ప్రెసిడెంట్ పిళ్లా పకీరునాయుడు, ప్రధాన కార్యదర్శి ఆదారి పారుపల్లి రవి, కోశాధికారి పెంటకోట సత్యప్రసాద్, ఆడిటర్ పెంటకోట సత్యనారాయణ, పాలక వర్గ సభ్యులు, గ్రామ పెద్దలు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**మద్రిపాలెం:** అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు అన్నారు. 53వ వార్డు 298 మద్రిపాలెం లక్ష్మీనగర్ సచివాలయం పరిధిలోని శ్రీనివాస స్ట్రీట్‌లోని కార్పొరేటర్ బర్కత్ అలీతో కలిసి సోమవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ అర్హులందరికీ నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ 54వ వార్డు అధ్యక్షుడు చల్లా ఈశ్వరరావు, మండల అధ్యక్షుడు పైడి కృష్ణారావు మాస్టారు, డైరెక్టర్లు రాయుడు శ్రీను, ఎస్.రవికుమార్, జేసీఎస్ ఇన్‌చార్జి వసంతల అప్పారవు, 53వ వార్డు నాయకులు షేక్ బాబ్జి, రామలక్ష్మి, సదరం జ్ఞానేష్, హనుమంతు, భార్గవ్, ఝాన్సీ, శ్రీదేవి, జయలక్ష్మి, భాను, సుశీల, బాలాజీ, లక్ష్మి, సంపత్, అన్సర్‌వలీ,సీ నియర్ నాయకులు బోగవల్లి గోవింద్, కె.చిన్న, చిరంజీవి, వెంకటేష్, మల్లిక్, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందిస్తున్న కె.కె.రాజు, బర్కత్ అలీ

## మహిళలకు అండగా సీఎం జగన్

**తాటిచెట్లపాలెం:** మహిళలను అన్ని రంగాల్లో ముందుకు నడిపించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 45వ వార్డు కార్పొరేటర్ కంపా హనోకు అన్నారు. సోనియాగాంధీ నగర్ సామాజిక భవనంలో సోమవారం కొండవాలు ప్రాంతాల్లోని 6 డ్వాక్రా సంఘాలకు చెందిన 500 మంది మహిళలతో వైఎస్సార్ ఆసరా ప్రీ లాంచింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చి ప్రతీ కుటుంబంలో సంతోషాలు నింపారని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో ఉత్తర నియోజకవర్గంలో కె.కె.రాజును గెలిపించుకోవాలని, తద్వారా మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు.

సీవో రమణి మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం కింద 4వ విడతగా 23వ తేదీ మంగళవారం రూ.1.37 కోట్లు విడుదల చేయనున్నారని తెలిపారు. వార్డులో ఒక్క ఆసరా పథకం కింద నాలుగు విడతల్లో సుమారు రూ.5.47 కోట్లు ప్రభుత్వం మహిళల ఖాతాల్లో జమచేసిందన్నారు. కార్యక్రమంలో జోన్-5 ఏపీడీ పద్మావతి, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, నాయకులు హరిపట్నాయక్, రాజు యాదవ్, నేపాల్ శ్రీను, బాబూరావు, మాత ఈశ్వరావు, దుర్గ, నాయుడు, ఎల్లాజి, ఆర్పీలు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ కంపా హనోకు



కార్యక్రమంలో పాల్గొన్న డ్వాక్రా మహిళలు